సాక్షి రాజన్న సిరిసిల్ల

శనివారం | 22 | జూన్ | 2024



ఆరోగ్య యోగా

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం సిరిసిల్లలో బతుకమ్మఘాట్ వద్ద పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల



భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి రాజన్నకు అభిషేకాలు, అన్నపూజలు చేశారు.

గరిష్టం/కనిష్టం
34.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో అక్కడక్కడ స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పనుల్లో వేగం పెంచాలి

- అదనపు కలెక్టర్ గౌతమి



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో వేగం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ పూజారి గౌతమి సూచించారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర ప్రాథమిక, అల్మాస్‌పూర్ ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం పనుల్లో భాగంగా జరుగుతున్న ఎలక్ట్రికల్, మూత్రశాలలు, కిటికీలు, డోర్లు, సంపు నిర్మాణ పనుల రికార్డులను తనిఖీ చేశారు. లక్ష్యంలోపు నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీఈవో రమేశ్‌కుమార్, ఎంఈవో దూస రఘుపతి తదితరులు పాల్గొన్నారు.


సార్ జీవితం భావితరాలకు స్ఫూర్తి



సిరిసిల్లటౌన్: తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని అఖిల భారత తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జూకంటి జగన్నాథం పేర్కొన్నారు. గాంధీచౌక్‌లో శుక్రవారం జయశంకర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. మారసం జిల్లా అధ్యక్షుడు టీవీ నారాయణ, ప్రధాన కార్యదర్శి ఆడెపు లక్ష్మణ్, ఎలగొండ రవి, అంకారపు రవి, బూర దేవానందం, దూడం గణేశ్, వంశీ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతన్న మురిసె..

- రుణమాఫీతో అన్నదాతల్లో ఆనందం
- ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.2000 కోట్లకుపైగా అవసరం
- గతేడాది డిసెంబరు 9లోపు తీసుకున్న వారికే!
- మార్గదర్శకాలు వస్తేనే అమలుపై మరింత స్పష్టత
- ప్రభుత్వం వద్ద ఇప్పటికే లబ్ధిదారుల వివరాలు



సాక్షిప్రతినిధి,కరీంనగర్: రాష్ట్రంలోని రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తోన్న రుణమాఫీ విషయంలో ప్రభుత్వం తీపి కబురు తీసుకొచ్చింది. ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా కాంగ్రెస్ పార్టీ రూ.2 లక్షలలోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా శుక్రవారం కేబినెట్‌లో ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9వ తేదీ మధ్య ఐదేళ్లకాలంలో తీసుకున్న రూ.2లక్షల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించింది. వచ్చే ఆగస్టు 15వ తేదీ నుంచి ఏకకాలంలో రుణమాఫీని అమలు చేస్తామని తెలిపింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు త్వరలోనే విడుదల కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా రైతు రుణాల మాఫీకి దాదాపుగా రూ.31వేల కోట్లకుపైగా నిధులు అవసరం అవుతాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాకు ఎంతలేదన్నా రూ.2000 కోట్లకుపై నిధులు అవసరం అవుతాయని అధికారులు అభిప్రాయపడ్డారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల, పెద్దపల్లిలో అధికశాతం చిన్న కమతాలను (ఒకటి, రెండు ఎకరాలు) సాగు చేసే రైతులే ఉన్నారు. వీరిలో పంటల ఆధారంగా ప్రభుత్వం రుణాలు ఇచ్చింది. చిన్న కమతాలను సాగుచేసే రైతులు దాదాపు 3.5 లక్షల మంది వరకు ఉంటారని అంచనా. వీరందరూ తమ సామర్థ్యం మేరకు రూ.లక్షలోపు పంట రుణాలు తీసుకున్న వారే. మిగిలిన వారిలో ఐదు, పది ఎకరాలకు మించి సాగుచేసే వారిలో కొందరు రూ.2 లక్షల వరకు పంటరుణాలు తీసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న దరిమిలా.. ఇప్పుడు అధికారులు ఏ జిల్లాలో ఎంత మంది రైతులు రుణాలు తీసుకున్నారు? అన్న లెక్కలు తీస్తున్నారు. ఇందుకోసం లీడ్ బ్యాంక్ మేనేజర్లు ఇప్పటికే నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపారని సమాచారం. మార్గదర్శకాల అనంతరం లబ్ధిదారుల విషయంలో స్పష్టత రానుంది.

మార్గదర్శకాలు వస్తేనే.. స్పష్టత..

రుణమాఫీ విషయంలో ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. ఒకసారి మార్గదర్శకాలు వస్తే రుణమాఫీ చేసే విధానంపై అందరికీ స్పష్టత వస్తుంది. రైతు భరోసాకు విధించిన తరహాలోనే రైతు రుణమాఫీలోనూ పలు మార్పులు ఉంటాయన్న ప్రచారం సాగుతోంది. అనర్హులను ముందే గుర్తించడం ద్వారా వీలైనంత ఎక్కువ మంది పేద రైతులకు సాయం చేయాలన్నది ప్రభుత్వ నిర్ణయంగా కనిపిస్తోంది. అయితే, ఎవరు అర్హులు? ఎవరు అనర్హులు? అన్న విషయంలో ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చిందని తెలిసింది. అందుకే, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా ఐదేళ్లకాలంలో చేసినట్లుగా రుణమాఫీ చేసేందుకు సిద్ధమైందని సమాచారం. రైతు రుణమాఫీ, లబ్ధిదారుల గణాంకాలపై సమీక్ష జరిపి త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో రుణమాఫీకి కావాల్సిన నిధులు కేటాయిస్తారని సమాచారం.

అర్బన్‌బ్యాంక్‌ను అగ్రగామిగా నిలపాలి

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్



బ్యాంక్ చైర్మన్‌ను సత్కరిస్తున్న కేటీఆర్

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్ల సహకార అర్బన్ బ్యాంక్‌ను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలపాలని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు కోరారు. పద్మశాలి కల్యాణ భవన సంఘంలో శుక్రవారం నూతన పాలకవర్గ ప్రతినిధులకు పార్టీ తరఫున అభినందన సత్కారం ఏర్పాటు చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ అధికారంలో లేకపోయినా బ్యాంక్ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సైతం బ్యాంక్ పురోగతికి దోహదం చేయాల్సిందిగా కోరాలన్నారు. అనంతరం అర్బన్ బ్యాంక్ అధ్యక్షుడు రాపెల్లి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆన్‌లైన్ చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జెడ్పీ, మున్సిపల్ చైర్‌పర్సన్లు న్యాలకొండ అరుణ, జిందం కళ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, బొల్లి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అభయహస్తం అమలు చేయాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ ప్రకారం దళితులకు రూ.12 లక్షల అంబేడ్కర్ అభయ హస్తం అమలు చేయాలని ఎమ్మెల్యే కేటీఆర్ డిమాండ్ చేశారు. పదిర బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ రమేశ్ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

గంభీరావుపేట(సిరిసిల్ల): సముద్రలింగాపూర్‌కు చెందిన మల్లవరం మధుసూదన్‌రెడ్డి కుమారుడు మణిదీప్‌రెడ్డి ఇటీవల మృతిచెందగా.. వారి కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. ఇటీవల మృతిచెందిన మల్లవరం సదాశివరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేశారు.

వరదలతో ఇబ్బందులు రాకుండా చూడాలి

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- మెడికల్ కాలేజీలో ఇబ్బందులుంటే చెప్పండి
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో వరదలతో ఇబ్బందులు రాకుండా చూడాలని, అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్లతో సమీక్షించారు. జిల్లాలో ప్రగతిలో ఉన్న వంతెనలు, రహదారుల వివరాలపై ఆరా తీశారు. ఆర్ అండ్‌బీ ఈఈ శ్యామ్‌సుందర్, డీఈఈ శాంతయ్య, ఏఈలు కిరణ్, సతీశ్, నరేందర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి వైద్యాధికారులతో సమీక్షించారు. మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించాలని సూచించారు. హాస్టళ్లలో దోమల నివారణ మందులు స్ప్రే చేయాలన్నారు.

వైద్యకళాశాల సందర్శన

జిల్లా మెడికల్ కాలేజీని కలెక్టర్ సందర్శించారు. అనాటమీ, ఫిజియాలజీ, బయో కెమిస్ట్రీ ల్యాబ్‌లు, లెక్చర్‌హాళ్లు పరిశీలించారు. విద్యార్థులు, అధ్యాపకుల వివరాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


జలంధర్ (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం ఆరెపల్లి శివారులోని ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి గురువారం అర్ధరాత్రి గీకురు జలంధర్(33) మృతి చెందాడు. మృతుడు గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లి నివాసి. జలంధర్ సిరిసిల్ల వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఇటీవల దుబాయి నుంచి వచ్చాడు. సోమవారం తిరిగి వెళ్లాల్సి ఉంది. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

కనీస వేతనాలివ్వాలి

- సీడీపీవోకు అంగన్‌వాడీల వినతి


సీడీపీవోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

సిరిసిల్లటౌన్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. ఈమేరకు శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి సిరిసిల్ల సీడీపీవో అలేఖ్య పటేల్‌కు వినతిపత్రం అందించారు. కనీస వేతనాలు రూ.26వేలు, టీఏ, డీఏలు చెల్లించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అసోసియేషన జిల్లా ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, శ్యామల, పద్మ, నాగలక్ష్మి, అంజలి, అయేషా, సుధారాణి పాల్గొన్నారు.

డెత్ సర్టిఫికెట్‌కు కొర్రీలు పెట్టొద్దు


మున్సిపల్ మేనేజర్ మీర్జా ఫసహత్ అలీకి వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: డెత్ సర్టిఫికెట్ జారీకి అనవసరపు కొర్రీలు పెట్టొద్దని కోరుతూ సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి కోరింది. ఈమేరకు శుక్రవారం సిరిసిల్ల మున్సిపల్ మేనేజర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్‌కు వినతిపత్రం అందించి మాట్లాడారు. డెత్ సర్టిఫికెట్ కోసం ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగుల డిక్లరేషన్ ఇవ్వాలనే నిబంధనతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో మాదిరిగానే ఉద్యోగుల డిక్లరేషన్‌తో పనిలేకుండా సర్టిఫికెట్లు జారీచేయాలని కోరారు. సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, ప్రతినిధులు కుసుమ గణేశ్, చిప్ప దేవదాసు, చిప్ప నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మకు పూజలు



వేములవాడఅర్బన్: స్థానిక ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మ, దుర్గమ్మ బోనాల పండుగ శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ పాలకవర్గం సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇక రైతునేస్తం కేంద్రం

- అన్నదాత మాట.. వీడియో కాన్ఫరెన్స్ నోట
- ప్రతీ మండలానికి రైతునేస్తం
- రాష్ట్ర కేంద్రం నుంచి నిర్వహించేలా సాంకేతికత

రాష్ట్రంలో ప్రస్తుతం 110కేంద్రాల్లోని రైతు వేదికల నుంచి వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులో ఉన్నాయి. ఈ నెలాఖరులోగా మరో 456 వేదికల్లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకొస్తాం.

- తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి



కరీంనగర్ అర్బన్: రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మూసధోరణిలో కాకుండా సాంకేతికత వైపు నడిపించేందుకు సౌకర్యాలు కల్పిస్తోంది. కాలానుగుణంగా వస్తున్న మార్పులను అవపోసన పడుతూ అధిక దిగుబడులు సాధించేలా ప్రోత్సహించనుంది. గత ప్రభుత్వం రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన రైతు వేదికలనే రైతునేస్తం కేంద్రంగా మలచుకోవాలని నిర్ణయించింది. వేదికను అన్నదాతలకు మరింత ప్రయోజనకారిగా మార్చేందుకు యోచిస్తోంది. ఇప్పటికే నియోజకవర్గానికో రైతు వేదికను వీడియో కాన్ఫరెన్స్‌కు కేంద్రంగా మలచగా తాజాగా మండలానికో రైతు వేదికను రైతునేస్తం కేంద్రంగా మార్చనున్నారు.

ప్రతిపాదనలు కోరిన ప్రభుత్వం

రైతులకు అనువైన రైతు వేదికలను వీసీ కేంద్రాలుగా మలిచేందుకు ప్రతిపాదనలు పంపాలని ప్రభుత్వం జిల్లా వ్యవసాయశాఖను ఇటీవల ఆదేశించింది. ఆయా మండలాల వారీగా రైతులకు సౌకర్యంగా ఉండే వేదికను ప్రతిపాదించాలని సూచించింది. నెట్‌వర్క్, సరిపడా స్థలం, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేయాలని నిర్దేశించగా జిల్లాలో కరీంనగర్ రూరల్‌లో గోపాల్‌పూర్, కొత్తపల్లి, మానకొండూరు, గన్నేరువరం, రామడుగు, గంగాధర, చొప్పదండి, తిమ్మాపూర్, శంకరపట్నం, ఇల్లందకుంట, జమ్మికుంట, హుజూరాబాద్‌లో రాంపూర్, చిగురుమామిడి, వీణవంక, సైదాపూర్ కేంద్రాలను రైతునేస్తాలుగా వినియోగించనున్నారు. కాగా సమాచార మార్పిడి, పంట పరికరాలు, ఉత్పత్తులకు సంబంధించి రైతు వేదిక నిర్మించాలని 2017లో అప్పటి ప్రభుత్వం ప్రకటించగా 2020లో పూర్తి చేసింది. 313 గ్రామ పంచాయతీలుండగా 5వేల హెక్టార్లకో రైతు వేదిక నిర్మించారు. ఒక్కో క్లస్టర్‌కు 10 గుంటల నుంచి అర ఎకరం స్థలాన్ని గుర్తించారు. జిల్లాలో మొత్తం 76 రైతు వేదికలను నిర్మించగా ఏఈవోల కనుసన్నలో నిర్వహిస్తున్నారు. ఒక్కో వేదికకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుంచి రూ.8లక్షలు, వ్యవసాయశాఖ నుంచి రూ.12లక్షలను కేటాయించగా మొత్తం రూ.20లక్షలతో నిర్మించారు. ఒక హాల్, రెండు గదులతో 2,046 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు.

రైతు వేదికతో బహుళ ప్రయోజనం

ఏ రైతు పట్టణాలకు వెళ్లకుండా సమీప ప్రాంతంలోనే అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా ఉండాలనేది రైతు వేదిక లక్ష్యం. వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయం అందులోనే ఉండగా ప్రభుత్వ పథకాలు నేరుగా చేరుతున్నాయి. రైతులకు పంటల సాగు విధానంపై శిక్షణనిస్తూ అధిక దిగుబడులు సాధించేలా చర్యలు తీసుకుంటుండగా ఆధునిక సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, మేలు రకమైన విత్తనాల ఎంపిక, తయారీ, సాగు మెలకువలతో అధిక దిగుబడులు సాధించడం, గిట్టుబాటు ధరలు పొందేలా వ్యవసాయశాఖ, అనుబంధ విభాగాల నుంచి ఎప్పటికప్పుడు సూచనలు అందిస్తున్నారు. రైతు సమావేశమందిరాలుగా, గోడౌన్లుగా, విత్తన, ఎరువులు, ధాన్యం నిల్వ కేంద్రాలుగా వినియోగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం మంగళ, శుక్రవారా ల్లో రైతు వేదికల్లో ఏఈవోల ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇకముందు శిక్షణ కార్యక్రమాలను నిపుణులైన వ్యవసాయ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టనున్నారు. దీని ద్వారా రైతులకు పంటల సాగు విధానం, సస్య రక్షణ చర్యలు, తెగుళ్ల వాటి నివారణ చర్యలు నేరుగా తెలియజేసే వీలు కలుగుతుంది. ప్రభుత్వం అందించనున్న రైతుభరోసా, రైతుబీమా, పంట రుణాలకు సంబంధించిన ఎలాంటి సందేహానికైనా పరిష్కార మార్గాలను సులువుగా అందజేసే వీలుంది.

రైతులకు ప్రయోజనం

ప్రభుత్వం మండలానికో రైతు వేదికను వీసీ కేంద్రం(రైతు నేస్తం)గా మార్చడం రైతులకు ఎంతో ప్రయోజనకరం. అన్నదాతలకు ఎప్పటికప్పుడు సేద్యంలో మార్పులపై అవగాహన పెరుగుతుంది.

- బత్తిని శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ అధికారి

మెరుగైన వైద్యసేవలందించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- కోనరావుపేట పీహెచ్‌సీ తనిఖీ


కోనరావుపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న కలెక్టర్

కోనరావుపేట(వేములవాడ): ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కోనరావుపేటలోని పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీలోని మందులు అందజేసే గది, పరీక్షలు చేసే ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డ్‌ను పరిశీలించారు. నిత్యం ఎంతమంది రోగులు వస్తున్నారని, సీజనల్ వ్యాధుల కేసులపై ఆరా తీశారు. అనంతరం దవాఖాన ఆవరణను పరిశీలించి, మెడికల్ ఆఫీసర్‌కు పలు సూచనలు చేశారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ వేణుమాధవ్, తహసీల్దార్ విజయ్ ప్రకాశ్‌రావు, హెల్త్ అసిస్టెంట్ సవాయిలాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి క్లాత్‌ఫోల్డింగ్ మిషన్



జాతీయ ఇన్‌స్పైర్‌కు ఎంపికైన మిషన్‌తో విద్యార్థి జక్కని హేమంత్, గైడ్ పాకాల శంకర్‌గౌడ్

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి జక్కని హేమంత్ తయారు చేసిన క్లాత్ ఫోల్డింగ్ మిషన్ జాతీయ స్థాయికి ఎంపికైంది. గైడ్ టీచర్ పాకాల శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో తయారుచేశారు. నేతన్నల కష్టాలకు పరిష్కారం చూపేలా తయారుచేసిన ఈ ఎగ్జిబిట్ గతంలో పలువురి మన్ననలు పొందింది. జిల్లాకు చెందిన విద్యార్థి రూపొందించిన క్లాత్ ఫోల్డింగ్ మిషన్ జాతీయస్థాయికి ఎంపికవడంపై జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతిలాల్ విద్యార్థి హేమంత్‌ను, గైడ్ టీచర్ శంకర్ గౌడ్‌లను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయస్థాయికి ఎంపికవడం జిల్లాకు గర్వకారణమని డీఈవో పేర్కొన్నారు.

నేతన్నలపై సర్కార్ చిన్నచూపు

- కుదేలైన సిరిసిల్ల వస్త్రపరిశ్రమ
- చూసీచూడనట్లుగా ప్రభుత్వ చర్యలు
- యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్


మాట్లాడుతున్న కూరపాటి రమేశ్

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ సర్కారు నేతన్నలపై చిన్నచూపు చూస్తోందని తెలంగాణ పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. సిరిసిల్లలోని అంభాభవాని ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన నేతన్నల మహాసమావేశానికి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్లను రద్దు చేసిందన్నారు. దీనికి తోడు సిరిసిల్లలో తయారయ్యే పైవేటు వస్త్రానికి మార్కెట్ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సబ్సిడీ తొలగించడంతో నేతన్నలు సాంచాలను తుక్కుకింద అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా మంది పనులు లేక రోడ్డున పడ్డారన్నారు. ప్రధాన సమస్యలైన విద్యుత్ సబ్సిడీ, యారన్ సబ్సిడీ, నేతన్న బీమా, త్రిఫ్ట్ పథకాలు, ప్రభుత్వం పరిశ్రమకు బకాయిపడ్డ డబ్బుల కోసం జూలై 7 నుంచి పోరుయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నేతపరిశ్రమను ఆదుకోవాలని కోరారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్, జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, ఎలిగేటి రాజశేఖర్, ఆసాముల సంఘం అధ్యక్షుడు గోనె పర్శరాములు, నక్క దేవదాసు, సిరిమల్లె సత్యం, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం/వేములవాడఅర్బన్: వాహనదారులు రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. సిరిసిల్లలోని అంబేడ్కర్ చౌరస్తా, వేములవాడ పరిధిలోని తిప్పాపూర్ చౌరస్తాలో శుక్రవారం రాత్రి నాకాబంధీ నిర్వహించారు. వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్ల అద్దాల కు నలుపు కవర్లు పెట్టుకోవద్దన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డీఎస్పీలు చంద్రశేఖర్‌రెడ్డి, నాగేంద్రచారి, వీరప్రసాద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సిరిసిల్లలో రూ.కోటిన్నరతో వ్యాపారి పరార్

- ఇంటికి, దుకాణానికి తాళం
- ఆందోళనలో రుణదాతలు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌ప్రాంతంలో టీవీల షోరూం నిర్వహించే ఓ వ్యాపారి రూ.కోటిన్నరతో ఉడాయించాడు. సిరిసిల్లలో నమ్మకంగా వ్యాపారం చేసిన సదరు వ్యాపారి రూ.కోటిన్నర వరకు తెలిసిన వారి వద్ద, సమీప బంధువల వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. పదిహేను రోజుల కిందటే దుకాణానికి, ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా ఊరి విడిచి వెళ్లాడు. అతనికి డబ్బులు ఇచ్చిన వారు షాపు వద్దకు వెళ్లి ఆరా తీస్తే పక్షం రోజులుగా రావడం లేదని తెలిసింది. ఇంటికెళ్లితే తాళం వేసి ఉంది. సదరు వ్యాపారి సిరిసిల్లలో చాలా రోజులుగా నమ్మకంగా వ్యాపారం చేసినట్లు సమాచారం. ఆ నమ్మకంతోనే అనేక మంది రూ.లక్ష నుంచి రూ.20 లక్షల వరకు అప్పుగా ఇచ్చినట్లు తెలిసింది. అప్పులిచ్చిన వారు వ్యాపారి కనిపించకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. కుటుంబంతో సహా వెళ్లిన సదరు వ్యాపారి పొరుగు రాష్ట్రంలో నివాసం ఉంటున్నట్లు భావిస్తున్నారు.

ప్రిలిమ్స్, మెయిన్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్ష కోసం ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ వెల్ఫేర్ అభివృద్ధి అధికారి సాయిబాబా తెలిపారు. జిల్లాలో డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు జూలై 3 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూలై 7న ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు ప్రవేశం పొందితే లాడ్జింగ్, భోజనం, రవాణా ప్రయోజనం కోసం నెలకు రూ.5వేలు ఇవ్వడం జరుగుతుందని, బుక్‌ఫండ్ నిమిత్తం మరో రూ.5 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు.

దొంగల హల్‌చల్

- మల్లాపూర్, దేశాయిపల్లెలో చోరీ


వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మల్లాపూర్, దేశాయిపల్లె గ్రామాల్లో రెండిళ్లలో చోరీకి పాల్పడ్డారు. మల్లాపూర్‌కు చెందిన బాస ఎల్లవ్వ ఆరుబయట నిద్రపోతుండా బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలో నుంచి మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారు. అదే గ్రామానికి చెందిన తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేశ్‌లకు చెందిన రూ.30వేల విలువైన రెండు సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. దేశాయిపల్లెలో తేల్ల పర్శరాములు ఇంట్లో రూ.4వేలు ఎత్తుకెళ్లారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, తంగళ్లపల్లి ఎస్సై డి.సుధాకర్ పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలి

- డీఆర్‌డీవో శేషాద్రి


మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల: జిల్లాలోని ప్రతీ మహిళను స్వశక్తి సంఘాల్లో చేర్పించాలని డీఆర్‌డీవో శేషాద్రి కోరారు. సిరిసిల్లలో శుక్రవారం మహిళాశక్తి కార్యక్రమంపై జిల్లాస్థాయి శిక్షణ నిర్వహించారు. డీఆర్డీవో మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో రూ.లక్ష కోట్లను ఎస్‌హెచ్‌జీలకు లింకేజీ ఇప్పించాలని, కోటి మహిళలను కోటీశ్వరులను చేయాలన్నారు. రూ.25వేల కోట్లను వ్యాపారాభివృద్ధికి వినియోగించాలని, మహిళలకు వ్యాపారంలో నైపుణ్య శిక్షణ ఇవ్వాలని సూచించారు. ప్రతీ మహిళా సంఘ సభ్యురాలికి రూ.2లక్షల బీమా సౌకర్యం, ప్రమాదబీమా రూ.10 లక్షలు చేయించాలన్నారు. వ్యాపారాలు, మార్కెటింగ్, బ్రాండింగ్ అభివృద్ధి చేయాలని, అమ్మ ఆదర్శ స్కూల్లలో వీవో ప్రెసిడెంట్‌ల ద్వారా స్కూల్ బిల్డింగ్ రిపేర్లు చేయించడం, మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులు చేయించాలన్నారు. అడిషనల్ డీఆర్‌డీవో గొట్టె శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత, డీపీఎం పద్మయ్య, సుధారాణి, ఏపీఎం రాజేశ్, శ్రీనివాస్, సరస్వతి పాల్గొన్నారు.

ప్రకృతిపై మమకారంతో విత్తనబంతులు

- 2.60లక్షల విత్తనాలు సేకరించిన విద్యార్థిని బ్లెస్సీ
- తండ్రి బాటలో తనయ
- అడవిలో వెదజల్లనున్నట్లు వెల్లడి


విత్తనబంతులతో బ్లెస్సీ

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన ప్రకృతి బ్లెస్సి ప్రకృతిపై మమకారంతో 2.60 లక్షల విత్తనాలు సేకరించి విత్తనబంతులు తయారు చేసింది. తన తండ్రి ప్రకృతి ప్రకాశ్ చూపిన బాటలో ముందుకెళ్తోంది. ఈసారి తన కుటుంబం 6 లక్షల విత్తన బంతులను అడవిలో వేయాలనే లక్ష్యంగా ముందుకెళ్తుంగా.. చిన్నారి బ్లెస్సీ తనవంతుగా విత్తన బంతులు తయారు చేసింది. నాలుగోతరగతి చదువుతున్న బ్లెస్సీ పాఠశాల సమయం ముగిసిపోగానే చెట్ల కిందకు వెళ్లి వితనాలు సేకరించింది. ఇలా సేకరించిన విత్తనాలతో విత్తనబంతులు తయారు చేసింది. ఇలా ప్రకృతిపై బాధ్యతగా విత్తనబంతులు తయారు చేసిన బ్లెస్సీ స్కూల్ హెచ్ఎం దేవేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ అభినందించారు.



స్టూడెంట్‌మార్చ్

సిరిసిల్లటౌన్: నీట్‌ను మళ్లీ నిర్వహించాలని కోరుతూ విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు శుక్రవారం సిరిసిల్లలో స్టూడెంట్‌మార్చ్ నిర్వహించారు. పేపర్ లీకేజీపై ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని కోరారు. నీట్ నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

26 నుంచి సమ్మె



వేములవాడఅర్బన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 26న చలో కలెక్టరేట్ చేపడుతున్నట్లు కార్మికులు తెలిపారు. ఈమేరకు వేములవాడ మున్సిపల్ మేనేజర్ సంపత్‌రెడ్డికి శుక్రవారం నోటీసులు అందించారు. కనీస వేతనం రూ.26వేలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు గుర్రం అశోక్, లచ్చయ్య, శంకరవ్వ, రాధా, మమత తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ వద్దు.. సర్కార్ బడి ముద్దు

- ప్రైవేట్ పాఠశాలల దరఖాస్తులు తిరస్కరణ
- వీర్నపల్లిలో నేడు గ్రామపెద్దల సమావేశం


గ్రామపంచాయతీలో సమావేశమైన గ్రామపెద్దలు

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండలకేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటు కోసం వచ్చిన మూడు దరఖాస్తులను తిరస్కరించారు. జీపీ ఆఫీస్‌లో కార్యదర్శి పురుషోత్తం ఆధ్వర్యంలో సమావేశమైన ఎంపీటీసీ ఫోరం మండలాధ్యక్షుడు మల్లారపు అరుణ్‌కుమార్, గ్రామపెద్దలు ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. వీర్నపల్లిలో మూడు ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటుకు ఎన్‌వోసీ కోసం పంచాయతీకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే తమ గ్రామంలో ప్రైవేట్ పాఠశాలలకు చోటు లేదని, ప్రభుత్వ స్కూల్‌ను బాగుచేసుకుందామని గ్రామసభలో తీర్మానించారు. గతంలోనూ ప్రైవేట్ స్కూళ్లు ఉంటే.. వాటిని మూసివేయించిన చరిత్ర వీర్నపల్లి గ్రామస్తులకు ఉందని, మళ్లీ కొత్తగా అనుమతులు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కమిటీని గ్రామపెద్దలు ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా అరుణ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలోని అంగన్‌వాడీలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామయువకులు, పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలో సమావేశం కానున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తీ సుకోవాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులో మహిళ వీరంగం

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌లో వేములవాడ నుంచి సిద్దిపేటకు వెళ్లే బస్సులో సైకో మహిళ వీరంగం సృష్టించింది. ఆ మహిళ నుంచి దుర్వాసతన రావడం, అసభ్య ప్రవర్తనతో తోటి ప్రయాణికులను ఇబ్బందికి గురిచేసింది. దీంతో ప్రయాణీకులు కండక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మహిళను మందలించిన కండక్టర్, బస్సు డ్రైవర్‌పై ఆమె తీవ్ర పదజాలంతో మాటల దాడిచేసింది. విసిగిపోయిన ప్రయాణికులు డయల్ 100కు ఫోన్‌చేశారు. బస్టాండ్ నుంచి బయలుదేరిన బస్సును డిపో ముందు గంట సేపు నిలిపారు. అక్కడికి చేరుకున్న బ్లూకోర్టు సిబ్బందిపై ఆ మహిళ కత్తి చూపిస్తూ వీరంగం సృష్టించింది. వెంటనే మహిళ పోలీసులు వచ్చి ఆమెను బస్సు నుంచి దింపి పంపించారు. అనంతరం అక్కడి నుంచి ఆటోలో వెళ్లిపోయింది.

దాడి సంఘటనలో ముగ్గురిపై కేసు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన కులేరి దీప్తికుమార్‌పై శుక్రవారం అకారణంగా దాడి చేసిన సంఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కిషన్‌రావు తెలిపారు. పూర్తి వివరాలు ఎస్సై కథనం ప్రకారం. దీప్తికుమార్ తన ఇంటికి వెళ్తుండగా.. జనావాసాల్లో రోడ్డు పక్కన చింతకింది భాను, నిఖిల్ మరో యువకుడు మూత్ర విసర్జన చేస్తున్నారు. దానిపై ప్రశ్నించిన దీప్తికుమార్‌పై ముగ్గురు కలిసి బీరు సీసాతో దాడి చేశారు. అంతే కాకుండా ద్విచక్ర వాహనాన్ని కింద పడేసి బీభత్సం చేసినట్లు ఫిర్యాదు చేయడంతో ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.